క్లుప్తంగా

'చేతన'సేవలు అభినందనీయం

ఏన్కూరు: చేతన పౌండేషన్ సేవలు అభినంద నీయమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఏన్కూరులో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో చేతన ఆధ్వర్యాన అరవై మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతిఒక్కరు సేవా కార్యక్రమాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీలు బుజ్జి, కనకదుర్గ, సర్పంచ్ రుక్మిణితో పాటు కృష్ణవేణి, సురేష్‌నాయక్, ధర్మారావు, చందులాల్, నర్సింహారావు, సీతా రామయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

మధిర: నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించడంలో బీజేపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి తెలిపారు. మధిర మండలం ఆత్కూరు గ్రామ రైతులకు పరిహారం విషయంలో న్యాయం చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు కిషన్ రెడ్డి కార్యాలయం నుంచి నితిన్ గడ్కారీ కార్యాలయానికి రాసిన లేఖ ప్రతిని శ్రీధర్ రెడ్డి మీడియాకు విడుదల చేశారు. మిగిలిన గ్రామ రైతులకు నష్టపరిహారం వచ్చినట్లుగా ఆత్కూరు రైతులకు కూడా ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన రైలు

మధిర: ఇంజన్‌లో సాంకేతిక లోపం కారణంగా నరసాపూర్ నుంచి నాగర్‌సోల్ వెళ్లే షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు మధిర స్టేషన్‌లో గంటకు పైగా నిలిచిపోయింది. రైలు శనివారం మధిర స్టేషన్‌లో ఆగి బయలుదేరే సమయాన ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో గూడ్స్ రైలు ఇంజన్‌ను తీసుకువచ్చి రైలును పంపడానికి 1.25 గంటల సమయం పట్టడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

సర్టిఫికెట్ల జాతర

కొణిజర్ల: మండలంలోని శ్రీరామ కల్యాణ మండపంలో బీసీ కుల ఆదాయ ధృవీకరణ పత్రాలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రెండో శనివారం సెలవు దినం అయినప్పటికీ తహసీల్దార్ దొడ్డారపు సైదులు రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పిలిపించి కుల ఆదాయ ధృవీకరణ పత్రాలు మంజూరుకు ఏర్పాట్లు చేయించారు. కొణిజర్ల, పల్లిపాడు మీ సేవా కేంద్రాల నిర్వాహకులను పిలిపించి కొణిజర్లలోనే ఆన్‌లైన్ చేయించారు. శనివారం సుమారుగా 500 మందికి పైగా వివిధ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. వీరందరికీ శనివారం రాత్రి వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు ఇస్తామని సోమవారం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారు తీసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ ఆర్.రమాదేవి ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.

గుర్తింపులేని విద్యాసంస్థలను మూసివేయాలి

సత్తుపల్లి: ప్రభుత్వ గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివరం ఎంఈఓ బి.రాములకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కిరణ్, వంశీ ఉన్నారు.

వరిగడ్డి వామ దగ్ధం

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు గ్రామంలో ప్రమాదవ శాత్తు వరిగడ్డి దగ్ధం అయ్యింది. దీని విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందన్నారు. స్థానికులు మంటలు ఆర్పేస్తూ సత్తుపల్లి ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సత్తుపల్లి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి పూర్తి స్థాయిలో మంటలు ఆర్పింది.

పెళ్లి వేడుకలో ఘర్షణ

కారేపల్లి: పెళ్లి వేడుకలో మహిళతో ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించగా ఇరుపక్షాల వారు ఘర్షణ దిగారు. మండలంలోని గోవింద్‌తండాలో శనివారం పెళ్లి వేడుక సందర్భంగా భోజనాలు వడ్డిస్తుండగా ఓ వ్యక్తి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో క్యాటరింగ్‌కు వచ్చిన వ్యక్తి కలగజేసుకొని ప్రశ్నించగా గొడవ మొదలైంది. ఇరువర్గాల వారు కుర్చీలు, కర్రలు, రాళ్లతో కొట్టుకుపోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనపై రెండు వర్గాల వారు కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గేదెను ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

పెనుబల్లి: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు గేదెను ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా మాదేపల్లికి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు(57) ఏడాది కాలంగా పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో చేపల చెరువులు లీజ్‌కు తీసుకున్నాడు. శుక్రవారం రాత్రి చిలకలూరిపేట నుండి వీఎం బంజర్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా కుప్పెనకుంట్ల వద్ద గేదెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు.

దేశానికే ఆదర్శం.. ధరణి పోర్టల్

- కలెక్టర్ వీ.వీ.గౌతమ్
- ఎర్రుపాలెంలో రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ

ఎర్రుపాలెం: రాష్ట్రంలో అమలుచేస్తున్న ధరణి పోర్టల్ దేశానికే ఆదర్శమని, ధరణితోనే సుపరిపాలన అందుతోందని కలెక్టర్ వీ.వీ.గౌతమ్ తెలిపారు. ఎర్రుపాలెంలో శనివారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో రైతులకు పట్టాలు అందజేశారు. జమలాపురంలోని 150 ఎకరాలు సాగు చేస్తున్న 123 మంది, అయ్యవారిగూడెంలో 117 మంది అన్నదాతలకు పట్టాలు, పాసు పుస్తకాలు అందజేశాక కలెక్టర్ మాట్లాడారు. ధరణి పోర్టల్ వ్యవస్థ బ్యాంకింగ్ వ్యవస్థ మాదిరి ఉండాలని సీఎం కేసీఆర్ పదేపదే చెప్పేవారని, ఇప్పుడు అదే పరిస్థితి ఉండడంతో రైతుల ఇబ్బందులు తీరాయన్నారు. ధరణి పోర్టల్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 22,755 పాత సమస్యలను పరిష్కరించగా, 56,766 రిజిస్ట్రేషన్లు చేశామని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో చిరకాలంగా పెండింగ్ భూసమస్యలను ఆర్డీఓ రవీంద్రనాథ్ సూచనలతో పరిష్కరించిన తహసీల్దార్ తిరుమలాచారిని అభినందించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ ఉంటే అక్రమార్కుల ఆటలు చెల్లవనే ఉద్దేశంతో కొందరు రద్దు చేయాలని చెబుతున్నారని ఆరోపించారు. ధరణి వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్డీఓ రవీంద్రనాథ్, ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావుతో పాటు చావా రామకృష్ణ, కరుణాకర్‌రెడ్డి, మొగిలి అప్పారావు, ముల్పూరి స్వప్న, గోసు రామారావు, షేక్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రుపాలెం : రైతులకు పట్టాలు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

అన్నదాతలకు న్యాయం..

బోనకల్/చింతకాని: ధరణి పోర్టల్‌తోనే భూప్రక్షాళన జరగడమే కాక రైతులకు న్యాయం దరి చేరిందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. బోనకల్, చింతకాని మండలాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సుపరిపాలన దినోత్సవాల్లో ఆయన మాట్లాడారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో 40 ఎకరాల ఇనాం భూములకు సంబంధించి 45 మంది, లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో పది ఎకరాలకు సంబంధించి 23 మంది రైతులకు ఓఆర్సీ పట్టాలను జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆర్డీఓ రవీంద్రనాథ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, కోవూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, మధిర మార్కెట్ చైర్మన్ బందం శ్రీను, తహసీల్దార్లు శ్వేత, మంగీలాల్, ఎంపీడీఓలు వేణుమాధవ్, శ్రీనివాసరావుతో పాటు వేమూరి ప్రసాద్, జెర్రిపోతుల రవీందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, పొనుగోటి రత్నాకర్, వంకాయలపాటి లచ్చయ్య, పెంట్యాల పుల్లయ్య పాల్గొన్నారు.


పెనుబల్లి: ఏరుగట్లలో రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

భూ సమస్యలు పరిష్కారం..

పెనుబల్లి/కల్లూరురూరల్/తల్లాడ/ఏన్కూరు/కొణిజర్ల/సత్తుపల్లిరూరల్: ధరణి పోర్టల్ ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తహసీల్దార్లు శ్రీలత, సైదులు, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బుజ్జి, ఎంపీపీలు హైమావతి, శ్రీనివాసరావు తెలిపారు. పెనుబల్లి మండలంలోని ఏరుగట్లలో రైతులకు ఎమ్మెల్యే సండ్ర పట్టాదారు పాస్తుపుస్తకాలను అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహాలక్ష్మి సేవలను అభినందించారు. అలాగే, కల్లూరు మండలం పడమర లోకవరంలో 53 మంది రైతులకు 70ఎకరాల భూమిని ధరణి పట్టాలు అందశారు. కాగా, తల్లాడ, సత్తుపల్లి, ఏన్కూరుల్లో సుపరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. కొణిజర్లలో ధరణి విజయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డి.వెంకట్‌లాల్, రవీందర్, నర్సింహారావు, రమాదేవి, రవి, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, వెంకటశ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, నరేష్, జానిమియా, అలేఖ్య వినీల్, మోహన్‌రావు, శ్యామలాదేవి, జోగారావు, బాబ్జీప్రసాద్, రఘు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోనే సుపరిపాలన

వైరా/ముదిగొండ/కారేపల్లి: సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజలందరికీ సుపరిపాలన అందుతుందని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సింగరేణి ఎంపీపీ మాలోత్ శకుంతల అన్నారు. వైరాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సుపరిపాలనా దినోత్సవాన్ని ఆయన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలితో కలిసి ప్రారంభించారు. ముదిగొండలోని రైతు వేదికలో.. కారేపల్లి వైఎస్ఎస్ గార్డెన్‌లో సుపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కారేపల్లిలోని మాధారం గ్రామానికి చెందిన గిరిజన పోడు భూమి రైతులకు తహసీల్దార్ తూమటి శ్రీనివాసరావు అటవీహక్కు పత్రాలను అందించారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గేటు కారేపల్లికి చెందిన ఎర్రం వెంకన్నకు సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. ఉత్సవాల సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా దివ్యాంగులకు పింఛన్ రూ.వెయ్యి పెంచినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన 9 ఏళ్ల కాలంలో ఎన్నో సాహసోపేత నిర్ణయాలతో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల అభివృద్ధి అనేక పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే రూ.30 కోట్లు నిధులు ఇచ్చారని త్వరలో మరిన్ని అభివృద్ధి నిధులు రాబోతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ సభ్యురాలు కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, తహసీల్దార్ అరుణ, ఎంపీడీఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ముదిగొండలోని జెడ్పీటీసీ సభ్యురాలు పసుపులేటి దుర్గ, తహసీల్దార్ శిరీష, డీటీ కరుణాకర్, కారేపల్లిలోని వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ ఉమామహేశ్వరరెడ్డి, నాయిబ్ తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ నరసింహారావు, భాను, సంతగుడి చైర్మన్ ఐలయ్య, నాయకులు పెద్దబోయిన ఉమాశంకర్, తోటకూరి పిచ్చయ్య, ముత్యాల సత్యనారాయణ, అజ్మీర వీరన్న తదితరులు పాల్గొన్నారు.


వైరా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్


ముదిగొండ: మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

చింతకాని: మండలంలోని అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ విజయ కోదండరామస్వామి, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం, బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. శనివారం వేదపండితులు ఇంగువ మురళీకృష్ణ శర్మ, ఆంజనేయ శర్మ, భట్లపెనుమర్తి రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మంగతాయమ్మ, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్ఈఎల్‌కు బస్ సర్వీసులు

మధిర: మధిర డిపో నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్ వరకు నూతనంగా సూపర్ లగ్జరీ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ దేవదానం తెలిపారు. మధిర నుంచి ప్రతిరోజు ఉదయం 9:45 గంటలకు, రాత్రి 9:30 గంటలకు బయలుదేరే బస్సులు ఖమ్మం, సూర్యాపేట, ఎంజీబీఎస్, కూకట్‌పల్లి మీదుగా బీహెచ్ఈఎల్‌కు చేరుకుంటాయని, తిరుగుతు ప్రయాణంలో బీహెచ్ఈఎల్ నుంచి ప్రతిరోజు ఉదయం 9, రాత్రి 10:30 గంటలకు బయలుదేరతాయన్నారు. ఈ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజీ మార్గమే రాజ మార్గం

మధిర/సత్తుపల్లిటౌన్: లోక్ అదాలత్‌ను ఉపయోగించుకుని ఆవేశంలో చేసిన నేరాల నుంచి కక్షిదారులు విముక్తి పొందాలని మధిర కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్ రెడ్డి, అదనపు జిల్లా జడ్జి వెంకటి అపర్ణ తెలిపారు. శనివారం మధిర, సత్తుపల్లిలోని 6వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఇచ్చినతీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, ఈ తీర్పుపై పై కోర్టులకు అపీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. లోక్ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, జనార్ధన్ రావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, కట్టా పూర్ణచంద్ర రావు, వెంకట్రావు, విజయ్ కుమార్, రమేష్, గంధం శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ నాగలక్ష్మి, భద్రయ్య, పోతుల కృష్ణారావు, మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, కోర్టు సిబ్బంది వెంకన్న, హనీషా, సుధాకర్, సత్తుపల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి అయేషాసరీన్, ఏసీపీ రామానుజం, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, బార్ సెక్రటరీ వెంకట్రావ్, సీఐ టి.కరుణాకర్, కోర్టు సూపరింటెండెంట్ బోయినపల్లి రవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి, తదితరులు

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


తల్లాడ: సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

తల్లాడ/కల్లూరు/ఎర్రుపాలెం: దివ్యాంగులకు రూ.3116 నుంచి రూ.4116కు పెన్షన్ పెంచటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తల్లాడ కమ్యూనిటీ హాల్ వేదిక వద్ద, కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో, ఎర్రుపాలెం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, సఖినవీడు గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రటపటానికి పార్టీ నాయకులతో కలిసి పలువురు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామారావు, బానోత్ కృష్ణ, ప్రసాద్, మాజీ ఎంపీపీ రాము, బీఆర్ఎస్ నాయకులు జీవీఆర్, ఆశీర్వాదం, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా గర్జన'ను జయప్రదం చేయండి


సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు రంగయ్య

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెంలో ఈ నెల 11న జరిగే సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకులు మిర్యాల రంగయ్య, సింగు నర్సింహారావు, దమ్మాలపాటి శేషయ్య, సీపీఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం సత్తుపల్లిలోని స్థానిక జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సమంత క్యాంప్‌ల్లో సింగరేణి కార్మికుల సమావేశం నిర్వహించారు. పెనుబల్లి మండలంలోని లింగగూడెం, గట్టుగూడెం గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. మోదీని గద్దెదించేవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి వీరాస్వామి, సుధాకర్, నర్సింహారావు, గట్టయ్య, ఏఐటీయూసీ నాయకులు ఎస్.రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి టి.యోబు, పెనుబల్లిలో పద్దం జోగయ్య, పుల్లయ్య, వట్టం శ్రీను, మడకం రమేష్, కారం రాములు, సీతారాములు, పైద మహేష్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సభను విజయవంతం చేయాలి

మధిర: మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ఖమ్మంలో జరగనున్న బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్లపల్లి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరవుతారన్నారు. ఈ బహిరంగ సభకు పార్టీ శ్రేణులతో పాటు మేధావులు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారావు, ప్రకాష్, స్వర్ణాకర్, నాగభూషణం, నాగేంద్రబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతి.. బంధువుల నిరసన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో శనివారం మృతశిశువు జన్మించటంతో బంధువులు నిరసన వ్యక్తం చేశారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి పంచాయతీలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వాడే భారతి మొదటి కాన్పుకోసం సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 5న డెలవరీ అవుతుందని వైద్యులు తెలుపగా 8వ తేదీనాటికి నొప్పులు రాకపోవడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. కుంటుంబ సభ్యులు ఆపరేషన్ చేయాలని వైద్యులను కోరగా వైద్యులు నార్మల్ డెలవరీ చేయడంతో మృత శిశువు జన్మించింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వలనే ఇలా జరిగిందని భారతి భర్త నాగేంద్రరావు, తల్లి మంగ ఆరోపించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ.. శిశువుకు జన్యుపరమైన లోపం ఉండటం, మాయ సమస్య, నొప్పులు సరిగా తీయకపోవటం వల్లే శిశువు మృతి చెందిందని వివరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పది విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. అలనాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.